క్లుప్తంగా

అభివృద్ధి పనులు వేగవంతం

భాకరాపేట: మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని చిన్నగొట్టిగల్లు ఎంపీపీ బాలం యుగంధర్‌రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం మండల, సచివాలయ ఇంజినీర్లతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

రేపు అశ్విని ఆసుపత్రిలో రక్తదాన శిబిరం

తిరుమల: తిరుమలలోని అశ్విని ఆసుపత్రిలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కుసుమకుమారి తెలిపారు. అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దాతలు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల మధ్య రక్తదానం చేయవచ్చని పేర్కొన్నారు.

వ్యానును ఢీకొన్న కారు

చంద్రగిరి: మండలంలోని వెంకటంపేట సమీపంలో బుధవారం కారు వ్యానును ఢీకొంది. పోలీసుల కథనం మేరకు.. రాయచోటికి చెందిన సుదర్శన్ రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. కారులో కాణిపాకం బయలుదేరారు. వెంకటంపేట వద్ద కారు అదుపుతప్పి ఎదురుగా వస్తున్న లగేజి వ్యానును ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పంట నమోదు తప్పనిసరి

భాకరాపేట: ఈ నెల 30 లోపు పంటను తప్పనిసరిగా నమోదు చేయించాలని ఎర్రావారిపాళెం వ్యవసాయాధికారి ఖాదర్‌బాషా పేర్కొన్నారు. ఆయన బుధవారం ఎర్రావారిపాళెంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రైతులు వేసిన పంటను ఈ–క్రాప్ బుకింగ్ చేస్తేనే వైఎస్సార్ ఉచిత పంటల బీమా, సున్నా వడ్డీ, పంట సేకరణ, పంట రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ తదితర ప్రభుత్వ పథకాలకు అర్హత లభిస్తుందన్నారు. అలాగే రైతు భరోసా కేంద్రాల్లో యూరియా, డీఏపీ, 10.26.26 ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కావాల్సిన రైతులు తీసుకోవాలన్నారు.

అనారోగ్యంతో మహిళ మృతి

తిరుమల: తిరుమలలో బుధవారం అనారోగ్యంతో మహిళ మృతిచెందింది. స్థానికుల కథనం మేరకు.. బెంగళూరుకు చెందిన చంద్రకాంత్, దుర్గాదేవి(36) దంపతులు ఉపాధి నిమిత్తం తిరుమలకు వచ్చారు. స్థానిక మాధవ నిలయం ఎదురుగా ఉన్న మండపంలో తాత్కాలికంగా ఉంటూ చంద్రకాంత్ తిరుపతిలో పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. దుర్గాదేవి తిరుమలలో చిన్నచిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం మండపంలో పడుకున్న దుర్గాదేవికి మూర్ఛ వచ్చి మృతిచెందింది. సమాచారం అందుకున్న తిరుమల టూటౌన్ ఎస్‌ఐ సాయినాథ్ చౌదరి అక్కడికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతురాలి భర్తకు సమాచారం అందించారు. భర్త ఫిర్యాదు మేరకు చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.


ముగిసిన గోవిందరాజస్వామి పవిత్రోత్సవాలు

తిరుపతి కల్చరల్: గోవిందరాజస్వామి ఆలయంలో మూడు రోజులుగా చేపట్టిన పవిత్రోత్సవాలు బుధవారం సాయంత్రం పూర్ణాహుతితో ఘనంగా ముగిశాయి. చివరి రోజున ఉదయం సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి తోమాల సేవ, సహస్రనామార్చన చేశారు. అనంతరం ఉత్సవర్లను యాగశాలకు వేంచేపు చేసి వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 10.30 నుంచి 12.30 గంటల వరకు స్నపన తిరుమంజనం చేశారు. సాయంత్రం 5.30 నుంచి 6.30 గంటల వరకు ఉత్సవమూర్తులను నాలుగు మాడ వీధుల్లో ఊరేగించారు. రాత్రి 7.30 నుంచి 9.30 గంటల వరకు ఆలయంలోని యాగశాలలో వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతి చేపట్టి పవిత్రోత్సవాలు ముగించారు. ఆలయ డెప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునిక్రిష్ణారెడ్డి, ప్రధాన అర్చకుడు ఏపీ.శ్రీనివాస దీక్షితులు, సూపరింటెండెంట్ మోహన్‌రావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనుంజయ పాల్గొన్నారు.

వామపక్ష నేతల ధర్నా

తిరుపతి అర్బన్: విద్యుత్ చార్జీలు తగ్గించాలని, వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు అమర్చరాదని వామపక్ష నేతలు డిమాండ్ చేశారు. వారు బుధవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. లేనిపక్షంలో పోరాటాలను ఉధృతం చేస్తామని పేర్కొన్నారు.

అరుణ వర్ణ శోభితం



తిరుపతి నగరంపై నీలి మేఘాలు దోబూచులాడుతున్నాయి. అడపాదడపా చిరుజల్లులు కురిపిస్తున్నాయి. బుధవారం సాయంత్రం ఆకాశం మేఘావృతమైంది. అదే సమయంలో భానుడు హస్తాద్రిపై చేరాడు. అరుణ కిరణాలతో మేఘాలు సప్తవర్ణాలను రంగరించుకుని కనువిందు చేశాయి. ఈ దృశ్యాలు పేరూరు బండపై వెలసిన వకులమాత ఆలయంపైన కనిపించింది. వాటిని తిరుపతి స్థానికులు తన్మయత్వంలో మునిగిపోయారు. తమ సెల్‌ఫోన్లలో బంధించుకుని మురిసిపోయారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి





మెరుగైన ప్రజా రవాణానే లక్ష్యం



కొత్తగా చేపట్టనున్న రోడ్డు పనుల గురించి సూచనలు చేస్తున్న భూమన అభినయ్‌రెడ్డి

- ఆ దిశగా రాజీలేని నిర్ణయాలు అమలు
- డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో సరైన రవాణా వ్యవస్థ లేకపోవడం వల్ల ప్రజలు దశాబ్దాలుగా ఇబ్బంది పడుతున్నారని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. వారికి మెరుగైన రవాణా వ్యవస్థ తీసుకురావడమే లక్ష్యంగా రాజీలేని నిర్ణయాలు అమలుచేస్తున్నామని తెలిపారు. ఆయన బుధవారం అలిపిరి మెయిన్ రోడ్డులోని మునిసిపల్ హైస్కూల్ గ్రౌండ్ నుంచి గిరిపురం, చెన్నారెడ్డి కాలనీ, పాత మెటర్నిటీ హాస్పిటల్ రోడ్డును కలుపుతూ నిర్మిస్తున్న స్లిప్ వే రోడ్డు పనులను పరిశీలించారు. అదేవిధంగా మునిసిపల్ పార్క్ ఎదురుగా నుంచి దోబీ ఘాట్ మీదుగా సత్యనారాయణపురం వరకు నిర్మించనున్న మాస్టర్ ప్లాన్ రోడ్డును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తిరుపతి నగర అభివృద్ధితోపాటు ప్రజలకు మౌలిక వసతుల కల్పనలో రాజకీయ నష్టాలను సైతం బేరీజు వేసుకోకుండా ముందుకు వెళుతున్నామని గుర్తుచేశారు. మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధితో తిరుపతి దశమారుతోందన్నారు. ఈ రోడ్లన్నీ అందుబాటులోకి వస్తే తిరుపతి మరో 5 వేల ఎకరాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. అలానే నగరానికి కనెక్టివిటీ పెరుగుతుందని, నగరంపై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గుతుందని చెప్పారు. ఎస్‌ఈ మోహన్, మునిసిపల్ ఇంజినీర్ వెంకట్రామిరెడ్డి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాలసుబ్రమణ్యం, కార్పొరేటర్లు బస్వ గీత, అనీష్ రాయల్, తాతయ్యగుంట గంగమ్మ గుడి చైర్మన్ కట్టా గోపీయాదవ్, ఎలక్ట్రికల్ డీఈ నరేంద్ర, మాస్టర్ ప్లాన్ రోడ్ల పొలిటికల్ సమన్వయకర్త పులికంటి గోపీనాథ్ రెడ్డి, నాయకులు బస్వ బాలసుబ్రమణ్యం, షఫీఅహ్మద్ ఖాద్రి, విజయ్, కోదండ, కట్టా బాలాజీ, సురేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా రంగంలో అధిక ఉద్యోగావకాశాలు



మాట్లాడుతున్న నిరంజన్‌బాబు

రామచంద్రాపురం: వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగాల్లో ఫార్మా ముఖ్యమైనదని, ఇందులో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తిరుపతి కౌటిల్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసి డైరెక్టర్ శ్రీధర్ తెలిపారు. వెంకట్రామాపురం సమీపంలోని సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాలలో బుధవారం తిరుపతి కౌటిల్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసి ఆధ్వర్యంలో ఫార్మసి రంగంలోని ఉద్యోగ అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఫార్మసి రంగంలో నూతన ఔషధాల అభివృద్ధి, ఉత్పత్తి వేగవంతంగా జరుగుతుండడం వల్ల ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. సెవెన్ హిల్స్ ఫార్మసి కళాశాల ప్రిన్సిపాల్ నిరంజన్ బాబు మాట్లాడుతూ ఏ రంగంలోనైనా రాణించాలంటే ముందస్తు ప్రణాళికలు అవసరమని చెప్పారు. కార్యక్రమంలో కౌటిల్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసి సిబ్బంది ఎస్‌ఎస్ రెడ్డి, ప్రేమానందరెడ్డి, సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాల కరస్పాండెంట్ సుమలత పాల్గొన్నారు.

ది డివైన్ హిస్టరీ ఆఫ్ శ్రీ అనంతాళ్వార్ గ్రంథం ఆవిష్కరణ



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న జీయంగార్లు

తిరుమల: ది హిందూ గ్రూప్ ఆఫ్ పబ్లికేషన్స్ ముద్రించిన 'ది డివైన్ హిస్టరీ ఆఫ్ శ్రీ అనంతాళ్వార్' తమిళ పుస్తకాన్ని బుధవారం తిరుమలలో పెద్దజీయంగార్‌స్వామి, చిన్నజీయంగార్‌స్వామి ఆవిష్కరించారు. పెద్దజీయంగార్‌స్వామి మాట్లాడుతూ 1053– 1138 మధ్య కాలంలో తిరుమల కొండపై నివసించిన శ్రీ వైష్ణవ భక్తుడు అనంతాళ్వార్ చరిత్రను ఈ గ్రంథం వెలుగులోకి తెస్తోందన్నారు. అనంతాళ్వార్ తిరుమల పుణ్యక్షేత్రంలో పుష్ప కైంకర్యాన్ని ప్రారంభించారని, పూలతోటలను అభివృద్ధి చేసి ప్రతిరోజూ ఆలయానికి పూలమాలలు సమర్పించారని వివరించారు. అనంతాళ్వార్ తోటలో జరుపుకునే పవిత్రమైన బాగ్ సవారీ రోజున ఈ పుస్తకం విడుదల చేయడం సంతోషంగా ఉందన్నారు. గురువు పట్ల భక్తి, శక్తిని అర్థం చేసుకోవడానికి పుస్తకాన్ని చదవాలని భక్తులకు పిలుపునిచ్చారు. ఈ పుస్తకాన్ని మొదట తెలుగులో హైదరాబాద్‌కు చెందిన పీవీ రామిరెడ్డి రాశారు. దాన్ని తమిళంలో రాజి రఘునాథన్ అనువదించారు. ఈ కార్యక్రమంలో ది హిందూ బిజినెస్ లైన్ ఎడిటర్ రఘువీర్ శ్రీనివాసన్, వైస్ ప్రెసిడెంట్ (సేల్స్– డిస్ట్రిబ్యూషన్) శ్రీధర్ అరనాల, స్పెషల్ పబ్లికేషన్స్ ఇన్‌చార్జ్ ఆర్.శ్రీనివాసన్, క్లస్టర్ హెడ్ (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా) ఎస్‌డీటీ రావు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

చంద్రగిరి: పాలిసెట్ ద్వారా భర్తీకాని ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్న చంద్రగగిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సుకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలిసెట్ రాసి కౌన్సెలింగ్‌లో సీట్లు రాని వారు, 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు ఈఈఈ, ఈసీఈ కోర్సుల్లో చేరేందుకు ఈ నెల 30వ తేదీలోపు పాలిటెక్నిక్ కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9502603571, 8019729162లో సంప్రదించాలని సూచించారు.

అండర్ డ్రైనేజీ నిర్మాణానికి భూమి పూజ

చంద్రగిరి: మండలంలోని రెడ్డివారిపల్లి పంచాయతీలో అండర్ డ్రైనేజీ కాలువల నిర్మాణానికి బుధవారం ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి భూమి పూజ చేశారు. సుమారు రూ.30 లక్షల తుడా నిధులతో దిగువరెడ్డివారిపల్లి చెంచులక్ష్మీ కాలనీలో 300 మీటర్ల కాలువ నిర్మాణం, గ్రామంలో 800 మీటర్ల అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులు చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రేవతి, ప్రకాష్ రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఔరంగజేబు, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జలమయం



తిరుపతి నగరంలో మంగళవారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది. దీంతో తిరుపతి– రేణిగుంట ప్రధాన రోడ్డులోని అంకుర హాస్పిటల్ నుంచి ఆటో నగర్ వరకు వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

ఎమ్మెల్యే పెళ్లి కానుక పంపిణీ



కిరణ్‌కు పెళ్లికానుక అందజేస్తున్న అశోక్‌రెడ్డి, వార్డు మెంబర్లు



పాకాలలో పెళ్లి కానుకను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

తిరుపతి మంగళం: మంగళం సప్తగిరినగర్ పంచాయతీకి చెందిన నూతన వరుడు ఎం.కిరణ్‌కు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పెళ్లి కానుక పంపించారు. వాటిని బుధవారం ఉప సర్పంచ్ అశోక్‌రెడ్డి, వార్డు మెంబర్లు ఆర్‌వీ.మురుగేష్, మంజుల, మహేశ్వరరెడ్డి, నాయకులు మల్లెల నాగరాజు, భాస్కర్‌రెడ్డి, దేవరాజులు, మణి అందజేశారు.

పాకాల: పాకాల సచివాలయం–2 పరిధిలోని కరీతుల్లాబాద్‌కు చెందిన నూతన వధూవరులకు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పెళ్లి కానుక పంపించారు. వాటిని బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు అందజేశారు. ఎంపీటీసీ సురేఖ, బీసీ సెల్ మండల అధ్యక్షుడు మధు, సచివాలయం అధ్యక్షుడు సుధాకర్, వాణిజ్య విభాగం అధ్యక్షుడు మురళీకృష్ణ, నాయకులు నిత్యానంద, చంద్రశేఖర్, ఆంథోని, రాజా తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా



జాబ్ మేళా పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

పాకాల: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జేకేసీ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ మొహిద్దీన్‌బాషా తెలిపారు. ఆయన బుధవారం జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ అపోలో ఫార్మసి, ఫ్లిప్‌కార్ట్, క్వెస్ కార్ప్ సొల్యూషన్స్ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. డిగ్రీ చదివిన అభ్యర్థులు ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలని సూచించారు. వివరాలకు జేకేసీ సమన్వయకర్త ఎస్‌వి రమేశ్‌కుమార్‌ను 9491520740లో సంప్రదించాలన్నారు. అధ్యాపకులు ఈశ్వర్‌బాబు, మోహన్‌బెహరా, మాధవి, రమణమ్మ, రవి పాల్గొన్నారు.

కార్డియాలజీ హెల్త్ చెకప్‌కు విశేష స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

తిరుపతి తుడా: తిరుపతిలోని ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ ఆధ్వర్యంలో బుధవారం తిరుపతి మున్సిపల్ పార్కులో నిర్వహించిన ఉచిత కార్డియాలజీ హెల్త్ చెకప్‌కు విశేష స్పందన లభించింది. ఆసుపత్రికి చెందిన ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ సుమంత్ రెడ్డి, కార్డియోవాస్కులర్, థొరాసిక్ సర్జన్ డాక్టర్ త్రిలోక్ పొందూరి సుమారు 300 మందికి గుండె సంబంధిత వైద్య పరీక్షలు చేశారు. అవసరం ఉన్న వారికి మందులు అందజేశారు. హాస్పిటల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్ ముని తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జట్టును విజేతగా నిలపండి



అండర్–17 చిత్తూరు జిల్లా బాలబాలికల జట్టుతో ఎస్‌జీఎఫ్‌ఐ ప్రతినిధులు, పీడీలు

చంద్రగిరి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో త్వరలో జరగబోవు జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో జిల్లా జట్టును విజేతగా నిలపాలని జిల్లా విద్యాశాఖ అధికారి శేఖర్ తెలిపారు. తిరుపతి రూరల్ మండలం దుర్గసముద్రం జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం జిల్లా వాలీబాల్ జట్టు ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో డీఈవో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వాలీబాల్ పోటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు మంచి పేరు ఉందన్నారు. సెలక్షన్ కమిటీ తరపున 80 మంది పీడీలు భారీ ఎత్తున ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. క్రీడల ద్వారా శారీరక ఆరోగ్యం బాగుంటుందని, మానసిక స్థితిని అదుపులో ఉంచుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సుమారు 400 మందికి భోజనం ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ సెక్రటరీ విజయకుమారి, సురేష్‌బాబు, బాబు, వాలీబాల్ సంఘం సెక్రటరీ సిరాజ్ అహ్మద్, సీనియర్ పీడీలు సెల్వపాండియన్, నందకుమార్, మునిశేఖర్, వ్యాయామ విద్య జిల్లా కార్యదర్శి సుబ్రమణ్యం రెడ్డి, సర్పంచు పిపాసి, ఎంపీటీసీ మునిరెడ్డి, పీడీలు విజయకుమారి, ఎంఈఓలు దేవరాజులురెడ్డి, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

అండర్–17 బాలుర జట్టు

జట్టులో వాసు, అహ్మద్ షఫీ, దినేష్, అఖిల్ ఆర్య, శంకర్ నాయక్, కృష్ణ, ఉదయ కిరణ్, హేమాద్రి, శివ కుమార్, జీవన్ కుమార్, అజయ్ ఉస్మాక్ ఉన్నారు.

అండర్–17 బాలికల జట్టు

జట్టులో షణ్ముక ప్రియ, జాహ్నవి, రామశ్రావణి, పల్లవి, మానస, చరిత, జయశ్రీ, శ్వేత, ఇందు, శిరీష, వైష్ణవి, జోత్స్న ఉన్నారు. వారికి డీఈవో శేఖర్, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అభినందనలు తెలిపారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



వంశీప్రియకు చెక్కు అందజేస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

చంద్రగిరి: దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారికి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆపన్న హస్తం అందిస్తూ ఆదుకుంటున్నారని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం తుమ్మలగుంటలోని తన నివాసం వద్ద బాధితులకు సీఎం సహాయ నిధి చెక్కులు అందజేశారు. పాకాల మండలం చెన్నుగారిపల్లి పంచాయతీ బార్లికొండ బంగ్లా గ్రామానికి చెందిన మధునాయుడుకు అనారోగ్యంతో బాధపడుతుండగా మెరుగైన వైద్యం కోసం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ద్వారా సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఆయనకు రూ.3.50 లక్షలు మంజూరయ్యాయి. ఆయన మృతి చెందడంతో ఆయన కుమార్తె వంశీ ప్రియకు చెక్కు అందజేశారు. అదేవిధంగా తిరుపతి రూరల్ మండలం సాయినగర్‌కు చెందిన ఢిల్లీకుమార్ భార్య కవిత అనారోగ్యంతో బాధపడుతుండగా మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఆమెకు రూ.4.50 లక్షలు మంజూరయ్యాయి. ఇటీవల ఆమె కూడా మృతి చెందారు. ఆమె భర్త ఢిల్లీకుమార్‌కు మోహిత్ రెడ్డి చెక్కు అందజేశారు. మృతి చెందిన వారిని తిరిగి తీసుకురాలేమని, ఆ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉండాలనే ఉద్దేశంతో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేసినట్లు మోహిత్‌రెడ్డి తెలిపారు.

అందాల హరివిల్లు



తిరుమల శ్రీవారి ఆలయంపై బుధవారం హరివిల్లు కనువిందు చేసింది. ఒక పక్క ఎండకాస్తుండగా.. మరో పక్క వర్షం కురిసింది. ఈ క్రమంలో శ్రీవారి ఆలయ గోపురానికి గొడుగు పట్టినట్టుగా హరివిల్లు ఏర్పడింది. ఈ దృశ్యాన్ని చూసి భక్తులు ఆనంద పరవశులయ్యారు. తమ సెల్‌ఫోన్లలో చిత్రీకరించారు.

–తిరుమల

శేషాచలంపై మంచు దుప్పటి



రెండు మూడు రోజులుగా ఆకాశం మేఘావృతమై అడపాదడపా చిరుజల్లులు కురిసిస్తున్నాయి. బుధవారం వేకువజామున శేషాచలం కొండలను తెల్లని పొగమంచు కప్పేసింది. హిమపర్వతంలా కనిపించడంతో స్థానికులు ఆశ్చర్యం చెందారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి